

వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

టీడీపీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

చందానగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యసేవలు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్‌రెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కట్ట వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం చందానగర్ హుడాకాలనీలోని పార్టీ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 300 మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సమతుల ఆహార తీసుకుని, రోజూ వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్యయాదవ్, ఐటీడీపీ హరికృష్ణ, కోటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

ఆదిత్యనగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి



ఆదిత్యనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

హైదర్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్యనగర్‌లో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ఆదివారం పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో కలిసి పాదయాత్ర నిర్వహించి సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తామని, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు వెంకటరెడ్డి, గోపాల్‌రెడ్డి, గోపి, అశోక్, శ్రీనివాస్, ప్రసాద్, రాజు, విజయ్, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ పత్రాలు పంపిణీ



సీఎంఆర్ఎఫ్ పత్రాలు అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

హైదర్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ ఎల్లమ్మబండ మరియమ్మనగర్‌కు చెందిన ఎస్.నర్సింహచారికి అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ ఆదివారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం చేయించుకోలేక పోవడంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించడంతో అతడికి రూ.2.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం సీఎంరిలీఫ్ ఫండ్ మంజూరి పత్రాలను లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. మారేళ్ల శ్రీనివాస్, బాష్పక యాదగిరి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొ రేటర్ శేషగిరి

గాజులరామారం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కాలనీల్లో అభివృద్ధి పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని కమలమ్మ కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులను స్థానికులతో కలిసి ఆదివారం పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని ప్రతీ బస్తీ, కాలనీల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో రమణారెడ్డి, రామ్ ప్రసాద్, రాంబాబు, వాసుదేవరావు, మాణిక్యం పాల్గొన్నారు.



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రాముగౌడ్

కరాటేలో 20 మందికి మెడల్స్

దుండిగల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గండిమైసమ్మ, గాగిల్లాపూర్ ప్రాంతాలకు చెందిన 20 మంది కరాటే క్రీడాకారులు హైదరాబాద్, సరూర్‌నగర్ ఇన్‌డోర్ స్టేడియంలో న్యూ డ్రాగన్ ఫైటర్ మార్షల్ హర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో పతకాలు గెలుచుకున్నారు. మాస్టర్ బి.నరేష్ ఆధ్వర్యంలో వెళ్లిన ఈ క్రీడాకారులు 12 మంది ఫస్ట్ ప్లేస్, 5 మంది సెకండ్ ప్లేస్, ముగ్గురుకి థర్డ్ ప్లేస్‌లో నిలిచారు. క్రీడాకారులు సాధించిన విజయాన్ని తెలుసుకున్న డీపోచంపల్లి కౌన్సిలర్ ముడిమాల రాముగౌడ్ వారిని అభినందించారు.



జెరిపేటి జైపాల్‌తో రాష్ట్ర వడ్డెర సంఘం సభ్యులు

రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం

చందానగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జెరిపేటి జైపాల్‌ను ఆదివారం రాష్ట్ర వడ్డెరసంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. వెనుకబడిన కులాలను గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి వడ్డెర సామాజికవర్గానికి చెందిన జెరిపేటి జైపాల్‌ను రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవి ఇవ్వడం తమకు ఆనందంగా ఉందని వడ్డెర సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నాటి నుంచి నేటి వరకు బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసమే పని చేసిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెరసంఘం అధ్యక్షుడు సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు అనంతయ్య, డైరెక్టర్ పోచయ్య, భూమయ్య, వెలకస్వామి, రాములు, శ్రీరాములు, సత్యనారాయణ, అమ్మయ్య, కొండయ్య, రాజు, సాయిలు తదితరులు ఉన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఆచార్య విజయలక్ష్మి, రామస్వామియాదవ్

మహిళలు సాధించలేనిదంటూ ఏదీ లేదు

చందానగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆధునిక కాలంలో మహిళలు సాధించలేనిదంటూ ఏమీలేదని, వారు అన్నిరంగాల్లో దూసుకెళ్తున్నారని హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయ ఆచార్యులు విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంటసర్కిళ్లలోని 40 కాలనీల్లో మహిళలకు వివిధ క్రీడలు నిర్వహించి బహుమతులు చందానగర్ సరస్వతి విద్యామందిర్‌లో ఆదివారం అందజేశారు. మహిళలు, ఫ్రెండ్స్‌వెల్ఫేర్ సభ్యులతో కలిసి విజయలక్ష్మి, జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలానుగుణంగా స్త్రీలలో చైతన్యం కనిపిస్తోందని, ఉద్యోగ, వ్యాపార, పారిశ్రామిక, రాజకీయ రంగాల్లోనూ తన శక్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఎంవీఆర్ గ్రూప్, అధ్యక్షుడు మూల వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ.. మహిళల్లో పోటీతత్వం పెరగాలన్నారు. గొట్టిముక్కల బ్రహ్మానందం, మల్లేశ్, విజయలక్ష్మి, వరలక్ష్మి, సుభద్ర, కల్పన, వెంకటేశ్వర్లు, పాలెం శ్రీను, తదితరులు ఉన్నారు.

శివారులో జోరుగా గంజాయి వ్యాపారం

కల్లులో మత్తుకోసం కలిపే క్లోరోఫాంను పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)



- పోలీసులకు సవాల్ విసురుతున్న వ్యాపారులు
- 5 గ్రా. ప్యాకెట్లు తయారు చేసి విక్రయం
- వేలల్లో దండుకుంటున్న కేటుగాళ్లు

బాలానగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి వ్యాపారం శివారు ప్రాంతాల్లో చాపకింద నీరులా విస్తరిస్తోంది. వ్యాపారులు రోజుకో మార్గంలో గంజాయి సరఫరా చేస్తూ ఎక్సైజ్ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఇటీవల వరుసగా నమోదవుతున్న కేసులే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. శివారు, ఐటీ ప్రాంతం కావడంతో వ్యాపారం వేగంగా విస్తరిస్తోంది. దశాబ్దాలుగా వ్యాపారంలో ఆరితేరిన కొందరు కుటుంబసభ్యులను కూడా దీనిలోకి లాగుతున్నారు. ఫతేనగర్ డివిజన్ పార్థివ్‌వాడ, శివశంకర్‌నగర్, వడ్డెరబస్తీ, ఓల్డ్‌బోయిన పల్లి డివిజన్ పరిధిలోని హస్మత్‌పేట, వడ్డెరబస్తీ, మూసాపేట ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు పెరిగినట్టు సమాచారం. హైటెక్‌సిటీ, మాదాపూర్ ప్రాంతాల్లో నివాసముండే వారు మద్యం తోపాటు గంజాయి తీసుకుంటున్నట్లు ఎక్సైజ్ పోలీసులు చెబు తున్నారు. హైటెక్ సిటీ, మాదాపూర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ, బాచుపల్లి, మేడ్చల్, దుండిగల్, ఘట్‌కేసర్‌ల్లో గంజాయి వ్యాపారం విస్తరించిందని తాజాగా నమోదవుతున్న కేసులను బట్టి తెలుస్తోంది.

ఆంధ్రా.. ఒడిశా సరిహద్దు నుంచి..

ధూల్‌పేట్‌కు చెందిన కొంతమంది గంజాయి డీలర్లు ఆంధ్రా.. ఒడిశా సరిహద్దు నుంచి గంజాయి తెప్పించుకుంటున్నారు. వీరి నుంచి కొందరు కిలో రూ.20 వేల చొప్పున కొనుగోలు చేసి 5 గ్రా. ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.300కు విక్రయిస్తూ వేలల్లో సొమ్ము చేసుకుంటున్నారని ఎక్సైజ్ పోలీసులు చెబుతున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు (ఫైల్)

గంజాయి మత్తు సరిపోక..

మత్తు కోసం యువత అడ్డదారులు తొక్కుతున్నట్లు తెలుస్తోంది. మద్యం, గంజాయి ఇచ్చే మత్తు సరిపోని కొందరు ప్రమాదకరమైన సింథటిక్ డ్రగ్స్ వైపు ఆకర్షితులైతున్నట్లు సమాచారం. బర్త్‌డే, వీకెండ్ పార్టీల్లో వీటిని విరివిగా వినియోగిస్తున్నట్టు తాజాగా నమోదైన కేసులను బట్టి తెలుస్తోంది. విద్యార్థులు, రోజువారీ కూలీలు గంజాయి చాక్లెట్లను తీసుకుంటున్నట్టు సమాచారం.

మూడు నెలల్లో నమోదైన కేసులు

బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు అనేక కేసులు నమోదు చేశారు. తొమ్మిది మందిని పట్టుకుని 4.02 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న కేసులో ఇద్దరిని, క్లోరోపాం విక్రయిస్తూ పట్టుబడిన కేసులో ఎనిమిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సామాజిక బాధ్యతగా స్పందించాలి

గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై పోలీసులు ఉక్కుపాదం మోపాలి. లేకుంటే విద్యార్థులు వీటికి బానిసలై భవిష్యత్‌ను కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది కేవలం పోలీసు వారి బాధ్యతే కాకుండా సామాజిక బాధ్యతగా అందరూ స్పందించాలి. కాలేజీలు, స్కూళ్లలో పిల్లలు ఏం చేస్తున్నారు. ఎలా ఉంటున్నారు. అలవాట్లలో ఏమైనా మార్పులు వచ్చాయా అనేది గమనిస్తూ ఉండాలి.

- ఎస్.అరుణ్‌జ్యోతి, బాలానగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు

గంజాయి వ్యాపారులపై ఉక్కుపాదం

గంజాయి అమ్మితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. కాలేజీ, స్కూళ్లకు వెళ్లే విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. గంజాయి లేదా డ్రగ్స్, మత్తు పదార్థాలను తీసుకుంటున్న, విక్రయిస్తున్న వారి సమాచారం ఇవ్వాలనుకునే వారు 8712658739లో ఫోన్ చేసి చెప్పొచ్చు.

- డి.వేణుకుమార్, బాలానగర్ ఎక్సైజ్ సీఐ



ప్రజలతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

ప్రజల కలను సాకారం చేసిన ప్రధాని

రాయదుర్గం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రామ మందిర నిర్మాణం కోట్లాది మంది భారతీయుల కల అని, ఆ కలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ సాకారం చేశారని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం గచ్చిబౌలి విస్పర్ వ్యాలీలో అల్పాహార సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందుత్వం అన్ని వర్గాలను కలిపే వారధి అని అన్నారు. రామ మందిర నిర్మాణానికి దేశంలోని కోట్లాది మంది ప్రజలు తమవంతుగా విరాళాలు అందించారన్నారు. దేశం మరింత ముందుకు పోవడానికి కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. చేవెళ్లలో ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు

ఎన్నికలు పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలి

కూకట్‌పల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యే వరకూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నియమావళి అమల్లోకి వచ్చిన సందర్భంగా కూకట్‌పల్లి ప్రాంతంలో ఎన్నికల అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఎస్ఎ్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలతో పాటు స్థానిక పోలీసు అధికారులతో కలిసి ఆమె తనిఖీలు చేపట్టారు. పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, హోర్డింగ్స్, గోడరాతలపై తొలగించారు.

వాహనాల తనిఖీలు

కేపీహెచ్‌బీకాలనీ: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో కోడ్ అమలులోకి వచ్చింది దీంతో లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి కేంద్ర బలగాలు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. కేపీహెచ్‌బీ మలేషియన్ టౌన్‌షిప్ ఎదురుగా చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి వాహనాల తనిఖీ ప్రక్రియ ప్రారంభం అయిందని, ఎన్నికల నిబంధనలకు లోబడే నగదు తీసుకెళ్లాలని వాహనదారులకు కేపీహెచ్‌బీ సీఐ సూచించారు.



కేపీహెచ్‌బీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

రంగంలోకి ఎన్నికల నిఘా బృందాలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు ఇప్పటికే నిఘా బృందాలను కేటాయించి రంగంలోకి దింపారు. దీంతో శనివారం రాత్రి నుంచే నిఘా బృందాలు రంగంలోకి దిగి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు, రహదారుల్లో తనిఖీలు చేపట్టారు. అలాగే ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండెక్ట్) బృందాల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని గోడలు, బస్‌స్టాప్‌లతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల గోడ పత్రికలను, ప్రచార తెరలు, పార్టీల జండాలతో పాటు ప్రచార సామగ్రి తొలగింపు చేపట్టారు.

బిహార్‌కు హెచ్‌సీయూ విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యువ సంగం యాత్రలో భాగంగా ఎన్ఐటీ పాట్నాతో పాటు బిహార్‌లో హెచ్‌సీయూ విద్యార్థి బృందం పర్యటించనుంది. హెచ్‌సీయూలో ప్రారంభమైన ఈ బస్సు యాత్రను వీసీ ప్రొఫెసర్ బీజేరావు జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి ఏటా నిర్వహించే యువ సంగం యాత్రలో ఈ ఏడాది ఎన్ఐటీ పట్నాతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ పత్రాలు పంపిణీ

హైదర్‌నగర్: ఆల్విన్‌కాలనీ ఎల్లమ్మబండ మరియమ్మ నగర్‌కు చెందిన ఎస్.నర్సింహచారికి అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆదివారం బాధితుడి కుటుంబసభ్యులకు అందజేశారు. వైద్యం కోసం రూ.2.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం సీఎంరిలీఫ్ ఫండ్ మంజూరి పత్రాలను లబ్ధిదారుడి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మారేళ్ల శ్రీనివాస్, బాష్పక యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద సదుపాయాలు కల్పించాలి

షాపూర్‌నగర్: నేటి నుంచి జరుగనున్న టెన్త్ పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ అన్నారు. ఈ సందర్భంగా బాలానగర్ ఏసీపీ, కూకట్‌పల్లి ఏసీపీ, మియాపూర్, పేట్‌బషీరాబాద్ ఏసీపీలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం

మియాపూర్: కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి ఇన్‌చార్జిలు జగదీశ్వర్‌గౌడ్, బండి రమేష్ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మియాపూర్ ఆల్విన్‌కాలనీలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టీపీసీసీ లేబర్‌సెల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వీరేందర్‌గౌడ్, ఇలియాస్ షరీఫ్, నాగేశ్వరరావు, కాపూరి ప్రసాద్, వెంకటేష్, సత్యనారాయణ, డివి ప్రసాద్, రాజేష్, అంజనేయులు యాదవ్ పాల్గొన్నారు.

విజయదుర్గాభవాని అమ్మవారికి బోనాలు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ఆదర్శనగర్ కాలనీలో విజయదుర్గాభవాని అమ్మవారి వార్షిక బోనాల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లేశ్, గుణశేఖర్, బాబు, సత్యకుమార్, ధర్మరాజు, అశోక్, శ్రీను, మహేష్, సురేష్, మురళి, అశోక్, రాజు, రమేష్, రజనికాంత్, మహేందర్, కిట్టు, సాయి, భక్తులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో స్మైల్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్

హైదరాబాద్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ డెంటల్ ఆస్పత్రి స్మైల్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ సేవలను అందరూ వినియోగించుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. కొండాపూర్‌లో స్మైల్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ మొదటి శాఖను, కమర్షియల్ టాక్స్ మాజీ జాయింట్ కమిషనర్ వంగల హర్ష వర్ధన్‌తో కలిసి ప్రారంభించారు. దంత చికిత్సలో చిన్నారులు, వృద్ధులకు ప్రత్యేక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ఇంప్లాంట్స్, డిజిటల్ డెనిస్ట్రీ, స్మైల్ డిజైన్‌ల సేవలు అందిస్తున్నామని స్మైల్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ నిర్వాహకులు తెలిపారు.



డెంటల్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులు

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

జీడిమెట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో, బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకుల్లో ఒకరు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్ఎంటీ దర్గావద్ద శనివారం రాత్రి జరిగింది. చింతల్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ముప్పిడి నర్సింహ పెద్దకుమారుడు గణేశ్(22), అతడి స్నేహితుడు సాయితేజ శనివారం రాత్రి బైక్‌పై చింతల్ నుంచి షాపూర్‌నగర్ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో గణేశ్ మృతిచెందగా, సాయితేజకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

మోదీతోనే భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠం: ఈటల



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఈటల రాజేందర్

కూకట్‌పల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ స్థాయిలో 11 నుంచి 5వ స్థానానికి తెచ్చారని, ఆ ఘనత మోదీదేనని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కొనియాడారు. గెలుపే లక్ష్యం అంటూ ఫోరం టు ఇం ప్రూవ్ థింగ్స్' (ఫిట్) ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో ఆదివారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సభ నిర్వహించారు. కూకట్‌పల్లి పీఎస్ఎం పాఠశాల ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశంలో విద్యావంతులు, మేధావులు పాల్గొనగా ముఖ్య అతిథిగా ఈటల రాజేందర్, గౌరవ అతిథిగా కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ కూడా హాజరయ్యారు. కార్యక్రమంలో 114 డివిజన్ ప్రీతంరెడ్డి, బాలాజి నగర్ బీజేపీ అధ్యక్షుడు వినోద్, రాకా సుధాకర్, సూరిబాబు రేవతి పాల్గొన్నారు.



గాజులరామారం చౌరస్తాలోని బ్యాంక్

యూనియన్ బ్యాంకులో మోగిన సైరన్

- దొంగలుపడ్డారని ఆందోళన

జీడిమెట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం చౌరస్తాలోని మూసి ఉన్న యూనియన్ బ్యాంకులో ఆదివారం ఉదయం సైరన్ మోగింది. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. బ్యాంకులో దొంగలు పడ్డారని ప్రచారం జరగడంతో బ్యాంకు వద్ద పెద్దఎత్తున జనం గుమిగూడారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు సైరన్ మోగుతూనే ఉండటంతో స్థానికులు 100 నెంబర్‌కు కాల్ చేశారు. సమాచారం అందడంతో జగద్గిరిగుట్ట పోలీసులు హుటాహుటిన బ్యాంక్ వద్దకు చేరుకున్నారు. ఆపై బ్యాంకు అధికారులకు సమాచారం అందించారు. బ్యాంకులో ఎందుకు సైరన్ మోగిందనేది తెలియలేదు. అయితే బ్యాంకుపక్కనే ఉన్న ఏటీఎం సెంటర్‌లో ఓ యువతి ఏటీఎం వెనుక భాగంలో నిలబడి, ఊడిఉన్న ఒక భాగాన్ని పట్టుకోవడం స్థానికులు గుర్తించారు. ఆమెను ప్రశ్నించారు. ఊడి ఉండటంతో పట్టుకున్నానని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయింది.

ప్రణాళికతో ర్యాంకు 'పది'లం

(5వ పేజీ తరువాయి)

ఎగురవేస్తారని పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో విద్యార్థులకు వారు పలు సూచనలు చేశారు.

కేంద్రానికి వెళ్లే ముందు ఇవి చూసుకోవాలి..

- హాల్‌టికెట్, బ్లూ, బ్లాక్ పెన్నులు, పెన్సిల్, రబ్బర్, షార్ప్‌నర్, స్కేల్, తదితర వస్తువులను సరిచూసుకుని ఒక పౌచ్‌లో పెట్టుకోవాలి. పరీక్ష ప్యాడ్, వాటర్ బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలి.
- ఎలక్ట్రానిక్ వస్తువులను, స్మార్ట్‌వాచ్‌లను తీసుకెళ్లవద్దు.
- రోజూ రాత్రి 10 గంటలలోపు నిద్రపోయి, మరుసటి రోజు ఉదయం 5 గంటలకు మేల్కొవాలి. పరీక్షకు సంబంధించిన ముఖ్యాంశాలను ఉదయం పూట చదువుకోవాలి.

కేంద్రంలో పాటించాల్సిన పద్ధతులు..

- ఇన్విజిలేటర్ ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌పై మీ పేరు ఉందో.. లేదో సరిచూసుకోవాలి. ఇన్విజిలేటర్ చెప్పే సూచనలు తప్పకుండా పాటించాలి.
- కనీసం 15 నిమిషాల పాటు ప్రశ్నాపత్రాన్ని చదివి బాగా వచ్చే జవాబులను టిక్ చేసుకోవాలి.
- రాసిన అడిషనల్స్‌ను వరుసక్రమంలో పెట్టాలి. అన్ని సమాధానాలకు ప్రశ్నల నంబర్లు సరిగా వేశారో.. లేదో చూసుకోవాలి.
- జవాబుపత్రంలో ఎక్కడైనా ఖాళీ స్థలం ఉంటే అక్కడ క్రాస్ మార్కు ఉంచి పీటీఓ అని రాయాలి.
- తీసుకున్న అడిషనల్ షీట్స్ నంబర్ల సంఖ్యను ఓఎంఆర్ షీట్‌పై తప్పనిసరిగా వేయాలి.
- గణితంలో సిద్ధాంతాలను వరుస క్రమంలో రాయాలి. ఫిజిక్స్, బయాలజీలో చిత్రాలను అందంగా వేసి వాటి పేర్లను, ఆవశ్యకతను వివరించాలి.

తల్లిదండ్రులు చేయాల్సినవి..

- పరీక్షలపై భయం పోగొట్టేందుకు తల్లిదండ్రులు పిల్లలకు ధైర్యాన్ని ఇవ్వాలి. పరీక్ష బాగా రాస్తావని తరచూ వారిలో నమ్మకాన్ని పెంచాలి.
- ఉదయం, సాయంత్రం వారికి తోడుగా ఉం డి, సబ్జెక్టులపై పునశ్చరణ చేయించాలి. ముఖ్యమైన పాయింట్స్‌ను గుర్తుంచుకునే విధంగా షార్ట్‌నోట్స్ రాయించాలి.
- ఉదయం 5 గంటలకు నిద్రలేపి 7 గంటల వరకు చదివించాలి. పరీక్షా కేంద్రానికి కనీసం అరగంట ముందు వెళ్లేలా సిద్ధం కావాలి. పిల్లలు సెంటర్ లోపలికి వెళ్లేవరకు అక్కడే ఉండాలి.
- పరీక్ష బాగా రాయకున్నప్పటికీ.. మరో పరీక్షలో ఎక్కువ స్కోర్ చేసే విధంగా ప్రోత్సహించాలి.

ఎక్కడి నుంచి వచ్చిందో చూడాలి

పరీక్షా కేంద్రంలో విద్యార్థులు టెన్షన్‌కు గురికావొద్దు. ప్రశ్నను జాగ్రత్తగా చదవాలి. ఎక్కడి నుంచి వచ్చిందో గమనించాలి. వచ్చిన వాటిని త్వరగా రాయాలి. గణితంలో వాస్తవ సంఖ్యలు, బహుపదులు, సమితులు, సాంఖ్యాకశాస్త్రం, సంభావ్యత, నిరూపణ రేఖాగణితం, రేఖీయ సమూహాల వ్యవస్థ, శ్రేణులు, జామితిలోని నిర్మాణాలను చూసుకుంటే 60శాతం మార్కులు కచ్చితంగా సాధించవచ్చు.

- నర్సింహారెడ్డి, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, జీహెచ్ఎస్ నల్లకుంట

విశ్వాసంతో పరీక్ష రాయాలి

ఏ ప్రశ్న వచ్చినా.. రాయగలను అనే విశ్వాసంతో విద్యార్థి పరీక్ష రాయాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పిల్లలతో పోల్చడం, నీవు సరిగా రాయలేవు, మర్చిపోతావు అనే మాటలను అనకూడదు.

- డా. హిప్నోపద్మాకమలాకర్, కౌన్సెలింగ్ థెరపిస్ట్

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు



మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వీరేందర్‌రెడ్డి

నిజాంపేట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి ప్రాంతంలోని 18వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డితో పాటు ప్రగతినగర్ మాజీ ఉప సర్పంచ్ చల్లా సుధీర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణారెడ్డి, కొలన్ బాల్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు.



హెచ్ఏఎల్ కాలనీలో పేరుకు పోయిన చెత్త

చెత్తను తొలగించాలి

షాపూర్‌నగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సూరారం, గాజులరామారం డివిజన్‌ల్లో పలు కాలనీలు, బస్తీల్లో చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోతోంది. వారం రోజులుగా చెత్త తొలగించకపోవడంతో గుట్టలుగా పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే చెత్త పేరుకుపోయి, కుక్కలు, పందులు, దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజలను రోగాల బారిన పడేస్తున్నాయి. కొన్ని దీంతో చెత్త పేరుకు పోయి, ఆ కాలనీలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.